# పెద్దవాళ్లున్నారుగా!

" విజయ "

సాయంత్రం నాలుగున్నర అయింది. కాలేజీనుంచి వచ్చి యీజీఛెయర్‌లో కూచున్నాను. డ్రెస్ మార్చటానికికూడా బద్ధకంగావుంది. అందులో యీవేళ స్టూడెంట్స్‌చేసిన అల్లరి భరించటానికి శక్యం కాకుండా పోయింది. పాఠమేమీ అవలేదు. అబ్బ! ఏంస్టూడెంట్స్!!

టెక్స్టుబుక్ అందుకునే ప్రయత్నంలో టేబిల్‌మీదకి వంగాను. రెండు కవర్లు కనిపించాయి. ఆత్రంగా తీసి చూశాను. ఒకటి లలిత వ్రాసింది.

"..ఈవూళ్ళోనే బోర్డు స్కూల్లో టీచర్‌గా ఎపాయింటయ్యాను. ఆర్డర్‌వచ్చి నాలుగురోజులైంది. నా జీవితంలోని యీ ఆఖరి ఆశయంమట్టుకు ఫలించింది. ఇంతకంటె ఆశించదగినదేమీ యికఉండదు...." పాపం! లలితకి సుఖపడాల్సిన వయసులోనే ఎంత నిరాశ! రెండో కవరు అమ్మ వ్రాసింది. అమ్మకి ఎంత బెంగ! కళ్ళమ్మట నీళ్ళుతిరిగాయి. అక్కడికి సెలవలికి వెళ్ళినా వచ్చేసేరోజునల్లా దిగులుగావుంటుంది. వారంరోజుల్లో నాన్నగారు వస్తున్నారని వ్రాసింది. ఉత్తరంనిండా అమ్మ నా గురించి పడిన దిగులు స్పష్టంగా కనిపిస్తోంది. నీళ్ళునిండి కళ్ళు మసకలు కమ్మాయి. కిటికిలోనుంచి బయటికి గార్డెన్‌వేపు చూశాను. కళ్ళనీళ్ళమూలాన ఎఱ్ఱగులాబీలు అస్పష్టంగా కనిపిస్తున్నాయి.

"నమస్తే! రండి" అన్నాను చేతులుజోడిస్తూ.

లోపలికి వచ్చాడు. కో-లెక్చరర్ గోపాల్. అమ్మ నాతోపాటు పంపినవంటావిడ దుర్గమ్మ టీతీసుకువొచ్చింది. గోపాల్‌కొక కప్పుయిచ్చి నేనొకటి తీసుకున్నాను.

గోపాల్ ప్రస్తుతం హోటల్లో వుంటున్నాడు. తండ్రి వాల్తేరులో రిటైర్డ్ తాసిల్దారు. ఏభైఎకరాల భూమికూడా వుంది. గోపాల్ అంటే తల్లిదండ్రులకి పంచప్రాణాలూనట. హడావిడిగా మన మాటలకి టైము యివ్వకుండా మాట్లాడుతాడు గోపాల్. సిటీఅంతా వకసారి తనతో తీసికొని చూపించాడు. లెసన్స్ ఎంత చక్కగా చెపుతాడనీ! అతని క్లాసులో మళ్ళీ చదవాలనిపిస్తుంది. ఈ మాటే అతనితో అంటే "ఆర్ట్సుదానివేగా నువ్వు! ఇప్పుడు నాక్లాసులో సైన్సు గ్రూప్‌లోచేరు" అన్నాడు నవ్వుతూ.

వారంరోజుల క్రిందట వచ్చినప్పుడు చెప్పాడు తను పెళ్ళిచేసుకోవాలనుకున్నానని. ఏడాదినుంచి లేనిది యివ్వాళ పెళ్ళి ప్రసక్తి ఎందుకు తీసుకువచ్చాడు అనిపించింది. నా గుండెలు దడదడ కొట్టుకున్నాయి

నాచేతిని తనచేతిలోకి తీసుకుంటూ "విజయా! నేనంటే నీకిష్టమేనా? ఎన్నాళ్ళబట్టో అడగాలనుకుంటున్నాను. మన యిద్దరి వుద్దేశాలూ కలిస్తే యిక అడ్డేముంది? మా నాన్నగారు నాయిష్టానికి అడ్డుచెప్పరు. నేనంటే వారికి చాలా ప్రేమ. మా అమ్మకూడా నీలాంటి 'పిల్ల'ను చూస్తే సంతోషిస్తుంది. నీ వుద్యోగానికి మన మారేజ్ యేమీ ప్రతిబంధక మవదు. ఏమంటావ్?" అన్నాడు. నాచెయ్యి వణికింది. నేను ఫ్లవర్‌వాజ్‌కేసి చూస్తూ "వద్దండీ. నేను పెళ్ళి చేసుకోదల్చుకోలేదు. హాయిగా యిల్లాగే వుద్యోగం చేసుకుంటూ ఉండాలని వుంది" అన్నాను. నాగొంతుకూడా వణికింది.

"నేనిల్లా అడుగుతానని నువ్వు అనుకోలేదుగదూ! నేను నీకు తగినవాణ్ణి కాననిపిస్తోందా?" అతని కళ్ళు మెరుస్తున్నాయి. నేనేమీ సమాధానం చెప్పలేదు. అతను నాజవాబుకోసం ఎదురుచూసి నిట్టూర్చి వెళ్ళిపోయాడు. ఎందుకో నాకు యీ మగవాళ్ళని చూస్తే భయం.

అంతే. మళ్ళీ యివాళవచ్చాడు. కాలేజీలో కనపడినా యీ వారంరోజులూ పలకరించలేదు. కాలేజీలోకూడా ఆతనూ నేనే తెలుగువాళ్ళం. మొదట్లో యితనుతెలుగులో పలకరించగానే ప్రాణం లేచివచ్చింది. మన ఆంధ్రా ఒకడైనా వున్నాడని, పెళ్ళిమాట ఎత్తకుండావుంటే బాగుండుననీ అనిపించింది గోపాల్‌ని చూస్తే.

ఇదంతా ఆలోచిస్తూ నేను నిశ్శబ్దంగా కూచున్నాను. సంభాషణ యెల్లా మొదలుపెట్టాలో నాకర్థంకాలేదు.

"విజయా ! నేనడిగినదాని కేమంటావ్ ?" అన్నాడు గోపాల్ నిశ్శబ్దాన్నిఛేదిస్తూ. నేను ఒకక్షణం ఆగి "లలిత జీవితాన్ని ప్రత్యక్షంగాచూసిన నేను మగవాళ్ళంటేను, పెళ్ళిమాట ఎత్తుతేను భయపడటంలో వింతేముంది ?" అన్నాను. లలిత ఎవరో అర్థంగాక నావేపుచూశాడు గోపాల్. నేను చూపు మరలించుకుని "ఔను. లలిత మీకెలా తెలుస్తుందిలెండి" అన్నాను.

ఫ్లవర్‌వాజ్‌లోని రోజాపువ్వుల వాసన సన్నగా ముక్కుకి తగిలింది.

"మా పెదనాన్నగారికి యిద్దరు కొడుకులు. పెద్దన్నయ్య చేతికందగానే పొలాలబాధ్యతని సగం పెద్దన్నయ్యమీద పెట్టేశారు. చిన్నన్న శేఖరంమటుకు పదమూడేళ్ళకి సెకెండుఫారంలో జాయినయ్యాడు పక్క టౌన్‌స్కూల్లో. అంతా పల్లెటూరి చదువులు. మా పెద్దమ్మగారికి శేఖరం అంటే చాలా ప్రేమ. పెద్ద చదువు చదువుతున్నాడని.

మా నాన్నగారు నన్ను ఎకనామిక్స్ ఆనర్స్‌కి వెళ్ళమని ఎడ్వైజిచ్చారు. అందువల్ల సైన్సు వొదులుకుని ఆర్ట్స్‌లోకి దిగాను. నేను ఫోర్తియర్ చదువుతుంటే నాకంటె ఆరేళ్ళు పెద్దవాడైన శేఖరం బి.కాం. సెప్టెంబర్‌కి కూచున్నాడు.

శేఖరానికి నేనంటే యిష్టం. ఫార్వర్డ్‌గా చదువుతున్నానని తనకి గర్వంగావుండనేవాడు. అందువల్ల నాకెప్పుడూ ఉత్తరాలు రాస్తూండేవాడు. నాకూడా పెద్దన్నయ్యకంటే శేఖరంఅంటేనే యిష్టంగా వుండేది. ఫోర్తియర్ అయ్యాక సమ్మర్‌లో మాపెద నాన్నగారు, శేఖరం ఒకసారి వాళ్ళఊరు రమ్మనివ్రాశారు. వాళ్ళమాట తీసెయ్యటమెందుకని బయల్దేరాను. వాళ్ళవూరికి రెండు మైళ్ళు స్టేషన్. అందుకని బండీ తీసుకువొచ్చాడు శేఖరం. "ఈ మూడేళ్ళలోను ఎంతఎదిగావ్ విజయా !" అన్నాడు శేఖరం ఆశ్చర్యంగా. ఇంటికి చేరేప్పటికి పన్నెండు గంటలయింది. ఇంకా ఎవరూ భోంచెయ్యలేదు. పెదనాన్నగారువచ్చి "ఏమమ్మా ! రైలు లేటయిందా ?" అని పలకరించారు. పెద్దమ్మగారికీ, పెద్దవొదినకీ యివ్వమని అమ్మ యిచ్చిన చీరెలూ అవీ యిచ్చాను. పెద్దవొదినవెనకాలే యింకో అమ్మాయి కనపడింది.

"ఆ అమ్మా యెవరు వదినా ?" అన్నానునేను కదంబమాల వొదిన కిస్తూ.

చామనచాయ కోలమొహం. మెళ్ళో ఒక పేట గొలుసు. ఇంకేమీ నగల్లేవు. సన్నగా పొడుగ్గావుంది. ఆకళ్ళలోమటుకు మంచి ఆకర్షణవుంది. పెద్ద అందగత్తెమటుకుకాదు.

"మా పెత్తల్లి కూతురు విజయా ! నేను మొన్న వెళ్ళినప్పుడు నాతో తీసుకువచ్చాను" అంది వదిన.

ఆ అమ్మాయిపేరు లలిత. చురుకైన పిల్ల కావటంచేత సాయంత్రంలోపున నాతో స్నేహం కలిపింది. తన సంగతులన్నీ చెప్పింది. తనిప్పుడు స్కూల్‌ఫైనల్ చదువుతోందిట. తండ్రి బోర్డుస్కూల్లో మాధమాటిక్స్ అసిస్టెంటుట. అప్పట్లో తను థర్డ్‌ఫారం చదివి మానేసిందిట. ఒక యేడాది తల్లీ తండ్రీ పెళ్ళిచెయ్యాలని సంబంధాలు చూశారుట. ఆస్తిపాస్తులేమీలేవు. కట్నం ఎక్కువ యివ్వలేరు. ఇంతలో హటాత్తుగా తల్లిపోయింది. అందుకని మళ్ళీ ఫోర్తుఫారంలో జాయినయ్యింది, నాయీడుదే.

"ఈయేడాది పేసయాక ట్రెయినింగ్‌కి వెడతాను" అంది లలిత నాతో. సాయంత్రం షికారుగా యిద్దరం తోటవేపు వెళ్ళాం. మావెనకాలే శేఖరం వొచ్చాడు. "ఎల్లావుంది విలేజ్ బ్యూటీ !" అన్నాడు నవ్వుతూనాతో. నేను శేఖరంకేసి చూసేప్పటికి శేఖరం లలితమీంచి దృష్టి మరలించుకుంటున్నాడు. లలిత నాకేసి చూసింది. దూరాన కోయిల సన్నగాకూస్తోంది. మేమింటికి తిరిగి వచ్చేటప్పుడు చెప్పింది లలిత నాతో, శేఖరం తనని ప్రేమిస్తున్నాడని. తననితప్ప యింకెవర్నీ చేసుకోనని చేతిలో ఒట్టువేశాడుట ఈమాటలు చెబుతున్నప్పుడామె

మబ్బుల్లో ఎగిరిపోయే పక్షిలాగా అవుపించింది. నిజమే. శేఖరం ఆమెని ఉదారబుద్ధితో చేసుకుంటే ఆమె చాలా సుఖపడుతుంది. చాలా నెమ్మదస్తురాలు. నేను చాలా సంతోషించా ఏవిషయానికి. కట్నంమటుకు వాళ్ళేమీ యివ్వలేరు. శేఖరం తనతో చెప్పిన ప్రతిమాటా నాతో చెప్పింది. పిచ్చిపిల్ల! నేను తనకి సోదరిలాగా కనిపిస్తున్నానుట. శేఖరం ఒక రోజు తను సీబ్లూకలర్ చీరె కట్టుకుంటే చాలా బావుందన్నాట్ట. అందుకని ఆ వాయిల్ పెట్టెలో జాగ్రత్తగా దాచుకుందిట. ఆమె నిర్మల స్వభావానికి నేను సంతోషించాను. ఆరోజు రాత్రే కాబోలు ఎందుకో మెళకువచ్చి చూస్తే పక్కన లలితలేదు. చూస్తే మేడమెట్ల దిగువని లలితా శేఖరం కూచునివున్నారు. వాళ్ళ ప్రేమ కంతరాయం కలిగించడమెందుకని వెనక్కి వచ్చి పడుకున్నాను.

ఆ తర్వాత అక్కడ వారంరోజులున్నాను. ఇంక ఆవూళ్ళోవుండటం చికాకుగా వుంది. యింకో రెండు రోజు లుండి బయల్దేరాను. లలిత తనకుత్తరాలు వ్రాస్తుండమని ఎడ్రస్ యిస్తూ నా ఎడ్రస్ అడిగింది. "మళ్ళీ నీ మారేజ్ కే నిన్ను చూడటం" అన్నా నవ్వుతూ. లలిత తలవంచుకు నవ్వింది.

ఆ తర్వాత నాకు వారానికో ఉత్తరం వ్రాసేది లలిత శేఖరం తనకి లెటర్స్ రాయటం సంగతికూడా. ఏదో పనిమీద వెడుతూ వాళ్ళ యింటికి వెళ్ళాట్ట శేఖరం. ఓ వారంరోజులున్నాడుట. వస్తూ సీబ్లూకలర్ జార్జెట్ ఎంచి తనకి పట్టుకొచ్చాడుట. ప్రతి అక్షరంలోను వాళ్ళిద్దరి ప్రేమ స్పష్టంగా కనపడేట్టు వ్రాసేది లలిత. స్కూల్ఫైనల్ పాసయింది. ట్రెయినింగ్‌లో సీటు వచ్చింది లలితకి.

ఫిఫ్తియర్ ఎగ్జామినేషన్స్ అయిపోయాయి. నా బాధ్యత పూర్తయింది. ఇక రిజల్ట్స్‌కోసం వెయిట్ చెయ్యసాగాను. ఒకనాడు అమ్మ పెద్దమ్మగారు ఉత్తరం రాశారని చెప్పింది. శేఖరానికి ఎవరో పదిహేనువేలు కట్నమిస్తామని వచ్చారుట. సంబంధం సెటిల్ చేసుకున్నాడుట. పిల్లకూడా బావుందని రాసింది ఆవిడ. నేనుతెల్లబోయాను. శేఖరం ఎల్లా వప్పుగున్నాడు దీనికి? తను కూడా కట్నమాశించాడా? నాకేం అర్థంఅవలేదు. "మీ అన్నయ్యలాంటివారు లోకంలో చాలా అరుదు" అంటూ రాసే లలితకేం జవాబిస్తాడు శేఖరం? లలిత తన ఆశాసౌధాలన్నీ శేఖరం అనే పునాదిమీద కట్టుకుంది. అవన్నీ కూలదోస్తాడా?

అమర్నాడే నాకు శేఖరం వ్రాసిన కవరు అందింది. అందులో పెళ్ళికూతురు సంగతి నిండిపోయింది. "విజయా! ఆ పిల్ల ఎంత బాగుంటుం దనుకున్నావ్? ఆ కళ్ళు బెదిరిపోతున్న లేడికళ్ళను గుర్తుకు తెస్తున్నాయి. ఆ అమ్మాయిపేరు 'ఉమ'ట. ఎంత బాగుందీపేరు...." ఈ ధోరణిలో వుంది వుత్తరం అంతా. దాన్ని వుత్తరం అనేకంటే 'ఉమాదేవి వర్ణన' అంటే బాగుంటుందేమో. కోపంతో చింపి అవతల పారేశాను. ఎంత ద్రోహం.

వారానికో లెటర్ వస్తూండేది శేఖరం దగ్గర్నుంచి. రానురాను నాకు శేఖరం మీద అసహ్యం ఎక్కువవుతోంది. ఆ సమ్మర్లోనే పెళ్ళి. నేను రానన్నాను. కాని నాన్నగారి బలవంతంమీద బయల్దేరాను. పెళ్ళిలో నేనా ఉమవేపు చూస్తూఉంటే శేఖరం నాకేసి చూసి నవ్వాడు. అంత అందమైన భార్యని సంపాదించుకున్నానని గర్వంకాబోలు. మర్నాడు అందరం కూచుని వుండగా ఆ అమ్మాయివచ్చి నాదగ్గిరకూచుంది. అందరూ ఆమె వేపే చూస్తున్నారు పెళ్ళికూతురుగదా అని. ఆమె నావేపు తిరిగి "ఏమండీ! మీరు నాకు వదిన అవుతార్టగా. నాకెవరు ఏయే వరసలవుతారో అన్ని సంగతులూ యీయన తెగవ్రాసేవారు. పెళ్ళి కాకత్రితమే ఉత్తరాలు వ్రాసుకోవటం మొదలు పెట్టాం మేము" అంది. అందరూ నవ్వారు. దీనితో ఆమె ఓ వెకిలిమనిషి క్రింద తేలింది. లేకపోతే అందరిలోనూ ఎవరేనా యిల్లాంటి సంగతులు చెబుతారా?

రిజల్ట్సు తెలిశాయి. నాకు క్లాసు వచ్చింది. శేఖరానికి కూడా ఎల్లాగో ఒకలా బి.కాం. కంప్లీటయింది. బళ్లారిలో ఉద్యోగం అయింది. నేను నాన్నగారి కోర్కెప్రకారం అన్నికాలేజీలకి అప్లయిచేశాను. ఇక్కడనుంచి ప్రిన్సిపాల్ టెలిగ్రాం యిచ్చాడు యింటర్వ్యూకి రమ్మని. నేనే సెలెక్టయినాను. అమ్మ దూరాభారమని వొద్దులుకోమంది. కాని నేను, నాన్నగారు ఆమెని ఒప్పించాం. శెలవులు ఎప్పుడెప్పుడా అని అమ్మ ఎప్పుడూ కాలెండరు చూస్తూ వుంటుంది.

శేఖరం వుత్తరాలు వ్రాయటం మానలేదు. తనావూరి

నించి ఉమకి పంపే బహుమతుల జాబితాలు, తనకి ఆ 'ఫర్గుపారం గ్రాడ్యుయేట్' రాసే సంగతులు చక్కగా ఏరికూర్చి కవర్లు నింపేవాడు. శేఖరం కవర్లు కొన్ని నేను అసలు విప్పనేలేదు. లలిత గాలిమేడలిట్లా కూల్చి వేసి ఆమెని నాశనం చేశాడు శేఖరం. ఆమెని యిక యేక్షణంలోనూ తల్చుకోడు. ఇక తర్వాత లలితకి ఒకే ఒక ఆశయం వుండేది. ఏస్కూల్లోనైనా టీచరుగాచేరితే రిటైరైన తండ్రీ. తనూ కాలక్షేపం చేయవచ్చునని. ఇవ్వాళే ఆసంగతి వ్రాసింది. అక్కడే టీచరు పోస్టు కాళీగా వుంటే అందులో జాయినయిందట!

అలారం టైంపీస్‌ని దీక్షగా చూస్తున్న గోపాల్ నాకేసిచూసి "విజయా! అందరూ శేఖరంలాంటివాళ్ళే వుంటారా? నేనుకూడా నిన్ను మోసగిస్తున్నాననుకుంటున్నావన్నమాట. ఏం?" అన్నాడు. అతని మొహం చాల గంభీరంగావుంది. ఆతనిలో యింత సీరియస్‌నెస్‌ని నేనెప్పుడూ చూడలేదు. గదినంతా చీకటి ఆక్రమిస్తుండటంచేత లేచి లైటు వేశాను. బయటవిడుస్తున్న సన్నజాజి మొగ్గలవాసన గాలిలో తేలివస్తోంది. గోపాల్ లేచాడు. "చూడు విజయా! లోకంలో అందర్నీ భగవంతుడొకే విధంగా పోతపొయ్యలేదు. నా నిశ్చయమేమిటో నీకు త్వరలోనే తెలుస్తుంది. గుడ్‌నైట్." మెట్లుదిగి వెళ్ళిపోయాడు. నేనూ వెనకాలే గేటువరకూ వెళ్ళాను దూరాన ఏవో బిల్డింగ్స్ దీపాలతో ప్రకాశవంతంగా మెరుస్తున్నాయి. దుర్గమ్మ వచ్చి పిలిచాకగానీ లోపలికి వెళ్ళాలనితోచలేదు. మాటిమాటికీ మనస్సులో "గోపాల్‌కి బాగా కోపం వచ్చిందా? యింకరాడా?" అన్న ప్రశ్నలే మెదులుతున్నాయి.

మర్నాడల్లా గోపాల్ అసలు కనిపించలేదు. ఎవరో అతను ఆవేళ లీవ్ పెట్టాడని చెప్పారు. నాకళ్ళు మటుకు కాలేజీలో ప్రతిరూమూ వెతికాయి.

ఆవాళ శనివారం. కాలేజీలేదు. నాన్నగారు ఎల్లుండి వస్తారు. ఏమీ తోచలేదు. నాలుగవగానే లేచి చీరెల షాపుకి బయలుదేరాను. రకరకాల సిల్కుచీరెలు పడేస్తున్నాడు ఎదురుగా. అమ్మకి ఒకటి కొనాలి. లలితకి ఒకటి కొనాలి. లలితకి ఏకలర్ సూట్ అవుతుంది? తళుక్కుమని ఎదురుగా సీబ్లూ కలర్ పట్టుచీరె మెరిసిపడింది. అసలే ఆమెది గాయపడిన హృదయం. నేనుకూడా యింకో దెబ్బ వెయ్యాలా? అనిపించింది. చివరికి రెండు చీరెలు ఎంచి అదారినే పోస్టాఫీసుకువెళ్ళి పార్శెలు చేసేశాను లలితకి. హాల్లో అడుగుపెట్టగానే ఎవరో పెద్దమనిషి యీజీచైయిర్‌లో పడుకుని కనిపించాడు. ఏభై ఏళ్ళు పైన వుంటాయి. తలంతా నెరిసి వెండిలా మెరుస్తోంది. సన్నగా పొట్టిగా పండు రంగులో వున్నాడు. అయన టక్కుమనిలేచికూచుని "రా తల్లీ! నీకోసమే చూస్తున్నాను. నీకోసమే ఆ వాల్తేరునుంచి బయలుదేరి వచ్చాను. ఎంత దూరంలో వున్నారే అమ్మా! వాణ్ణికూడా యింతదూరం వొద్దురా అంటే విన్నాడు కాదు. పైగా నాకు నచ్చినపిల్ల యిక్కడుంది. ఆ అమ్మాయితో మాట్లాడి పెళ్ళికివప్పించి వెళ్ళకపోతే నేను ఈదారినే ఫారిన్ పోతాను' అని బెదిరిస్తూ వుత్తరం రాస్తాడూ! నువ్వో పెంకిఘటానివన్నట్టు రాశాడు. నీలాంటి మంచి తల్లి ఎన్నడైనా పెంకితనం చేస్తుందా? వంటావిడ మీయింటి సంగతులన్నీ చెప్పిందమ్మా!"

ఇంతసేపటికి అర్థమైంది. ఈయనే గోపాల్ తండ్రి రిటైర్డ్ తాసిల్దారుగారు ఇదా గోపాల్ చేసిన పని? కాలేజీలో యీనాలుగు రోజులూ మూతి ముడుచుకుని తిరిగాడు నాకేసైనా చూడకుండా! ఇంతదూరం యీ వృద్ధుణ్ణి నన్ను వప్పించటానికి రప్పించాడు! సరిగ్గా నాకు తగ్గవాడు గోపాల్ ఆపూటంతా రానేలేదు ఈయన బాధ్యతంతా నామీదే పడేశాడు రిటైర్డ్ తాసిల్దారుగారు వాళ్ళయింటి సంగతులన్నీ చెప్పినవే చెబుతున్నాడు మధ్యమధ్యలో నాలాంటి పిల్లనుచూస్తే సంతోషంగా వుంటుందన్నాడు. ఓసారి "ఏమ్మా! మా గోపాల్ నీకు నచ్చులా?" అంటాడు. ఏంచెప్పేదీ? నాన్నగారు ఎల్లుండి వొస్తారని చెప్పాను. ఆయనతో మాట్లాడి మరీ వెళతానన్నారు.

సాయంత్రమయింది. నెమ్మదిగా తాసిల్దార్‌గారులేచి డ్రెస్ చేసుకొని తాతాయిన్‌స్టిట్యూట్ చూసి వస్తానని బయల్దేరి వెళ్ళారు దుర్గమ్మ కోసిపెట్టిన సన్నజాజులు గార్డెన్‌లో కూచుని దండకడుతున్నాను నీరెండ బంగారపు నీరు పోసినట్టుంది. గోపాల్ గేటుతోసుకుని నవ్వుతూ వొస్తున్నాడు. ఎన్నడూ ఎరుగని సిగ్గు ఆవహించింది నన్ను. మెల్లిగా వచ్చి ఎఱ్ఱ గులాబీ చేతికిస్తూ "ఏమంటావ్ విజయా!" అన్నాడు.

"మానాన్నగారు కూడా రెండురోజుల్లో వొస్తారనుకుంటాను పెద్దవాళ్ళున్నారుగా!" అన్నాను నేను.